రామారావు మార్కెట్టు దగ్గర సిటీ బస్సు ఎక్కాడు. బస్సెక్కిన తర్వాత నాలుగు ప్రక్కలా కలయచూడడము అతని అలవాటు. ఎరిగిన వాళ్ళెవ్వరయినా ఉంటే వాళ్ళతో కాలక్షేపం అవుతుందని అతని ఉద్దేశ్యం. మగ సీటుల్లో ఎవ్వరూ కనపడలేదు. లాంఛనంగా ఆడ సీట్లవంక చూశాడు– ఎవరయినా చుట్టా లుంటారేమోనని. అతని చూపు ఒక అమ్మాయిమీద పడింది: వేషధారణ చాలా సాదాగా ఉంది. ఆమె చురుకయిన కళ్ళతో తనవంకే చూస్తూ ఉండడం గమనించాడు. తానెరిగిన మనిషిగని అనిపించలేదు. ఆ అమ్మాయి ఇంకా చూస్తూనే వున్నది. కళ్ళు మూసుకుని ఆలోచించాడు గుర్తు తగల లేదు. "మీదే ఊరండీ" అని ఆ అమ్మాయి అడిగేసింది. "ఈ ఊరే" అని వూరుకున్నాడు. కాసేపాగి "ఎందుకలా అడిగారు" అని సన్నగా అన్నాడు. గుంటూరేమో అనుకున్నాను. మా మామయ్య పినతండ్రి కొడుకు అచ్చం మీలాగే ఉంటాడు".

ఇద్దరూ ఒకచోటే దిగారు. రావు ఆ అమ్మాయి ఏ దారిని వెడుతుందో అని పరకాయించి కాసేపు నుంచున్నాడు. తన దారి కాకపోయినా ఆసక్తితో ఆమెను అనుసరించాడు. ఇద్దరూ రోడ్డుమీద దగ్గర దగ్గరగా నడుస్తున్నారు. "మీది ఈ పేటనా" అన్నాడు.

"రెండు సందుల అవతల."

"మీ వారేం చేస్తున్నారు?"

"ఏదో పొట్ట పోసుకునే కొద్ది ఉద్యోగం. యాభై రూపాయ లిస్తారు నెలకు."

"ఏం చదివారు."

"ఇంటర్మీడియట్ తప్పారు. కాస్త మంచి ఉద్యోగమేదైనా చూసిపెట్టగలరా?"

ఇంతలో వాళ్ళసందు వచ్చేసింది.

"నా కయిదుగురు పిల్లలండీ" అంది ఆ అమ్మాయి దీనంగా.

"ఇంత చిన్న వయస్సులో!"

"అవును, భగవంతుడిచ్చాడు."

ఎవరయినా ఎదిగినవ్వారా?"

"ఉహూం. అంతా కూనా గురుసూ. పెద్దబ్బాయికి మాత్రం పదిమూడేళ్లు. చదువుకుంటున్నాడు."

"మీకేమయినా పొలాలున్నయ్యా?"

"ఆ అదృష్టంలేదు. ఒక అద్దె గదిలో అందరూ ఇరుక్కుంటున్నాం. దానికద్దె ఎంతో తెలుసా? అరవై రూపాయలు."

"యాభై రూపాయల జీతమూ. అరవై రూపాయల అద్దె. మిగిలిన పది రూపాయలెలా వస్తాయి. భోజనం ఎలా గడుస్తుంది?"

"వారు పొద్దు టయిము లెక్కలు వ్రాస్తే ఇంకొక డెబ్బయి రూపాయలు వస్తే."

"అయితే మాత్రం!

ఒక పూట తిండి, ఒక పూట పస్తు."

"మీరేం చదువుకున్నారు?"

"మెట్రిక్ తప్పాను"

"పూర్తిచేయరాదూ, ఏదయినా ఉద్యోగం వస్తే వేడినీళ్ళకు చన్నీళ్ళు తోడుగా ..."

"పిల్లల నేం చెయ్యాలి నేనుద్యోగం చేస్తే. అయ్యో! బియ్యాలకే దిక్కు లేకపోతే నాకెవరిస్తారు ఉద్యోగం! అయినా నాకింక చదువురాదు."

"మీ కంటే పెద్దవాళ్ళే చదువుకుంటున్నారు. దీక్ష ఉంటే చదువు రాకపోవడం ఏమిటి!"

"నేను విచారంచేత మరీ పెద్ద దాన్ని అయిపోయాను. నాకిప్పుడు పుస్తకాలు నా పిల్లలే".

రామారావుకు జాలి కలిగింది. వెంటనే ముక్కూ మొఖమూ ఎరుగని ఒక స్త్రీతో నడి రోడ్డు మీద మాట్లాడుతున్నానన్న స్ఫురణ కలిగింది.

"రోడ్డు మీద నిలబడి ఎంతసేపు మాట్లాడడం! ఈ సందులోనే మేముండేది రండి, మా యింటినీ, మా సంసారాన్నీ చూద్దురుగాని. ఎల్లాగూ ఇంత దూరం వచ్చారుగా!"

చివరి వాక్యంలో ఏమయినా ఆక్షేపణ ఉన్నదేమో రామారావుకు అర్థంకాలేదు. తాను మూర్ఖంగా రాననడానికి మనస్కొప్ప లేదు. అనుసరించాడు. మేడ మెట్లెక్కారు. మేడ మీద చిన్నగదిలో అక్కడపడతలల్లే ఇంత వాళ్లూ అంత వాళ్ళూ ఉన్నారు. సూదీదారంతో భర్త చిరిగిపోయిన చొక్కా కుట్టుకుంటున్నాడు.

"రండి. లోపలకు"

భర్త లేచాడు. కుర్చీ చూపించాడు. ఆ గదిలో ఉన్నది ఒక్క కుర్చీ, ఒక్క ముక్కాలిపీట. రావు కూర్చున్నాడు కాని ఏమి మాట్లాడాలో అతనికి తోచలేదు.

"మీ విషయం అంతా చెప్పాను. కాస్త మంచి ఉద్యోగం చూడమన్నాను. వీరు సిటీ బస్సులో పరిచయం అయ్యారు" అని ఆ అమ్మాయి ఊరుకుంది. రావు ఉద్యోగాన్ని చూచి పెడతాడన్న గంపెడంత ఆశతో ఆయన కృతజ్ఞతాపూర్వకమైన నమస్కారం చేశాడు. "క్షమించండి. నేను వెంటనే డ్యూటీకి పోవాలి—శెలవు" అని వెళ్ళిపోయాడు.

"మీ పేరేమిటి" అన్నాడు రావు.

"డబ్బులు" అన్నది నవ్వుతూ.

తాను పరధ్యానంగా విన్నానేమోనని అనుకుని 'సుబ్బులు" అయి ఉంటుందని ఊహ చేసి "సుబ్బులా" అన్నాడు.

"అసలు పెట్టిన పేరదే. కాని మానాన్నా, మా అమ్మా. నన్ను ముద్దుకు డబ్బులని పిలిచేవారు. డబ్బులయితే లేవుకాని నాపేరు డబ్బులే అయిపోయింది" అన్నది దీనంగా.

ఎగబడ్డ పిల్లలకు తాను తెచ్చిన మరమరాలు నేలమీద పోగులుగా విడివిడిగా పోసేసింది. వాటిమీద శనగపప్పుకూడా అల్లాగే పోసేసింది. వాళ్ళు పరమానందంతో ఒక్కొక్క పలుకూ ఏరుకుని తింటున్నారు. "పెద్ద వెధవ ఇంకా ఇంటికి రాలేదు" అని అనుకుంది. "వీళ్ళకు ఆది. సోమ. మంగళ బుధ, గురు అని పేర్లు పెట్టుకున్నాను. శుక్ర. శని మాత్రం పుట్టరు. నాకేదో జబ్బు చేస్తే పనిలోపని అని మా నాన్నగారు ఆపరేషన్ చేయించేశారు. మాయదారి సంతానం పిల్లలను కనగానే సరా! పోషించవద్దూ. చస్తున్నాను బాబూ!" అని కంట తడి పెటింది.

"అలా సంతానం వద్దనరాదు. ఈ అయిదుగురు కొడుకులలో ఎవరయినా ఒకరు ముఖ్యమంత్రి కావచ్చు. ఒకరు ప్రధానమంత్రి కావచ్చు" అన్నాడు రావు.

"ఇంకేం ఒకడు హైడ్రోజన్ బాంబు కనిపెట్టవచ్చు. ఒకడు హైకోర్టు జడ్జి కావచ్చు. ఒకడు సుప్రీమ్ కోర్టు జడ్జీ కాని ప్రెసిడెంటుకాని కావచ్చు అనికూడా చెబుతారు. మీరు ఏడ్చేవాళ్ళను నవ్విస్తారండీ."

రావు గది నాల్గువంకలా చూశాడు — ఏవో వంటకు కొన్ని గిన్నెలూ, ఒక మంచం, దాని క్రింద ఒక చిన్న మంచం ఉన్నవి. ఒక పెట్టెకూడా కన్పించింది. ఇంతట్లో పెద్దవాడొచ్చాడు. వాడికి కూడా మరమరాలూ శనగపప్పూ పెట్టి. కొన్ని డబ్బులు వాడికిస్తూ "వీరికి ముందు నమస్కారం పెట్ట"మని రావును చూపించింది. వాడు చెప్పినట్లు చేశాడు. ఒక కిలో బియ్యం పట్టుకురమ్మని వాడిని పంపించేసింది. వాడు ఎగురుకుంటూ వెళ్ళాడు. పిల్లలు ఆ డబ్బుల వంకచూసి "డబ్బులు. డబ్బులు" అని ఎగబడ్డారు. ఆమె అందరికీ వరుసగా తలకొక మొట్టికాయ వేసింది. "డబ్బులు" అనలేని చిన్న పిల్లవాడినికూడా వేసి, వాడు ఏడుస్తూ ఉంటే దగ్గరకు లాక్కుని ఓదార్చింది. పిల్లలు క్యారుమన్నారు – ఆమెకు నవ్వు వచ్చింది. 'వెధవలకు మరమరాలు పెడితే. తినికూడా డబ్బులకోసం ఎగబడ్డారు. నాకు బలే కోపం వచ్చేసింది. అసలే డబ్బులులేక చస్తుంటే...." అన్నది.

రావుకు కూర్చోవాలన్నా. వెళ్ళాలన్నా భారంగానే ఉన్నది. "ఇంటికి పిలిచి కాఫీ

# శిక్ష

పెదిభొట్ల సుబ్బరామశాస్త్రి



అయినా ఇవ్వలేని పరమ నిర్భాగ్యురాలిని" అని గొణుగుకుంటూ కంటతడి పెట్టింది. రావు గుండె తరుక్కుపోయింది.

'కొందరు ఇంట్లో వుండే డబ్బు సంపాదించే మార్గం చూసుకొంటారు విస్తళ్ళు కుట్టడం. అప్పడాలు చేయడం వంటివి చేసే రోజుకు రెండు రూపాయిలు లాభం రావచ్చు. వాటికి పెట్టుబడి తక్కువకదా!"

"ఇంకా నయం. పుణుకులు. వడలు. పచ్చి మిరపకాయ బజ్జీలూ. చేగోడీలు అమ్మమన్నారు కాదు' అన్నది సుబ్బులు.

పస్తు పడుకుని మాడడం కన్న ఏదో కొదిపాటిలాభమయినా వచ్చేపని గృహంలో ఉంటూ గృహిణి చేసుకుంటే తప్పేమి లేదుకదా!

"నిజమే. ఈ కోతులు అప్పడాల పిండి కెగబడి తినేస్తారు. విరేచనాలు పెడితే నేను చావాలి. ఈ 'యీతా మోతా" సంసారంతో ఒక ప్రక్క చస్తూ, ఇంకొక పని ఎక్కడ నెత్తిన పెట్టుకోను బాబూ!"

ఈతామోతా'' సంసారం అంటే మిటి?" సుబ్బులు నవ్వింది.

"అది యేమిటో నాకు తెలియదు. ఈడమూ కష్టమే - బరువు మోయడమూ కష్టమే. ఎక్కువ కష్టాలతో కూడిన సంసారం అనుకుంటాను.' నిరాశ నిస్పృహతో సుబ్బులు ఉన్నది కాని తెలివిగల మనిషే అని రావు అనుకున్నాడు. దాని అర్థం తనకు వేరుగా స్ఫురించింది. ఈడడంమీద వచ్చింది యీత, మోయడం మీద నుంచి వచ్చింది మోత. ఈత. మోత అంటే ప్రసవించడం. తిరిగి వెంటనే గర్భం ధరించడం'' అని తాననుకున్నాడు. అయితే ఈనడం అనేది పశువులకే ప్రసవించడం అనే అర్థంలో వాడబడుతోంది కను! తానా అర్థం పైకి చెబితే బాగుండదని ఊరుకున్నాడు.

"మీ నాన్న. మీ అమ్మా మిమ్మల్నేం ఆదుకోరా?" అన్నాడు.

"వారిదీ పెద్ద సంసారం. ఎన్నాళ్ళని ఆదుకుంటారు! అక్కడికీ కొద్ది సహాయం చేస్తూనే ఉంటారు. ఎవరి కాళ్ళమీద వారు నిలబడాలి."

సుబ్బులు కొంత వివేకం గల మనిషే అనుకున్నాడు రావు,

"కుట్టుపని నేర్చుకొని మిషన్ కొనుక్కుంటే ఎల్లా ఉంటుంది."

"నేర్చుకోవడం పెద్ద కష్టమయిన పని కాదు. ఇదివరకే కొంత నేర్చుకున్నాను. మేము మగవాళ్ళకు దుస్తులు కుట్టంగదా! బాగా ధనవంతుల ఇళ్ళల్లో కుట్టు మిషను లుంటాయి. కొందరు ఆడవాళ్ళకు మగవాళ్ళ కుట్లే నచ్చుతవి కాని ఆడవాళ్ళ కుట్లు నచ్చవు. పైగా స్టైలులు పెరిగిపోయినై. మాది షాపుగా ఉండదు కదా! ఇంటింటికి పోయి యాచించి గుడ్డలు తెచ్చుకోవాలి. కొందరు 'రేపురా మాపురా' అంటారు. ఇల్లాంటివారికి బజారులో ఇచ్చే కుట్టురేటు ఇవ్వకపోగా. కుట్టు నచ్చలేదని ఏవో సూటీపోటీ మాటలంటూ ఉంటారు. అసలు వారికి కుట్టేవాళ్ళు అంతకు ముందే నియామకమయి ఉంటారు. వారిని మాన్పించి

క్రొత్తవారి కివ్వడం కష్టం ఒక్క వీధిలో ఉండేవారుకూడా పోనీలే పేదరాలు కుప కారం జరిగినట్లుంటుందని కనికరించరు. మధ్య తరగతివారు లేబరర్ల దగ్గరకు పని కోసం వెళ్ళడం అలవాటు లేదు కదా! పైగా లేబరర్లలో ఆడదీ. మగా సంపాదిస్తారు. వాళ్ళా సినిమాలు చూస్తున్నారు. మా కుట్లు వారికీ నచ్చవు. కుట్టుపని అమ్మాయి అనగానే చాలా తేలిక. ఇక షాపుల్లో నెల జీతాలకు కుదరడం అంటే ఒక రకంగా పిల్లలకు దూరం కావడమే కదా కొన్ని గంటలు? అక్కడ ఉండే చిక్కులు అక్కడ ఉన్నవి. గౌరవంగా బ్రతకాలంటె మాలాంటి వారికి అది అనుకూలమయిన వృత్తి కాదు"

"అన్నింటికి అన్ని సమాధానాలు చెబితే ఎల్లా? విస్తళ్ళే నీకు సరియైన వృత్తిగా కన్పిస్తోంది. ఆకులు కొనుక్కుని కుట్టి అమ్మితే రోజుకొక రూపాయికి తక్కువ మిగలదు. నేను ఒక ఇరవై రూపాయలు అప్పుగా ఇస్తాను. ఆ పెట్టుబడితో నీకు తోచిన వృత్తి చేయి. అప్పుడే నెలరోజుల లోపుగా సొమ్ము ఇవ్వవచ్చు."

"మీరేదో మావారికి ఉద్యోగం ఇప్పించగల తాహతుగలవారనుకొని పరిచయంచేసుకున్నాను. ఆ పని మీరు చేయగలిగితే అది నాకు పెద్ద ఉపకారం."

"అది అంత తేలికయిన పనికాదు."

'మీరేమిచేస్తున్నార'నిరావును సుబ్బులు అడిగింది. రావు తనది సామాన్యమయిన ఉద్యోగమని చెప్పాడు.

"ఈ పిల్లలు నాపాల బడ్డారు. ఆయన మగ మహారాజు. ఏదో సంపాదించిన దానిలో కొంత ఇంట్లో ఇస్తారు. అది చాలదని వారికి తెలిసినా అంతకంటె సంపాదించలేని తన సామర్థ్యం తనకు తెలుసు. ఒకప్పుడెక్కడో ఆ రోజు గడచిపోయినా చాలునని భోజనంచేసి వస్తూ ఉంటారు. అన్నం లేక నీరసపడతారుకాని నా పిల్లలు ఆయుష్షుఉన్నది కనుక చావరు. వ్యాధులు వస్తవి. మళ్ళీ ఎక్కువ ఖర్చు. వాళ్ళకు విషం ఇచ్చి, త్రాగే సాహసం నేను చేయలేను. ఆత్మహత్య చేసుకుని దయ్యాన్ని కాలేను. నా తర్వాత వాళ్ళగతి ఏమవుతుందో అనే భయంచేత కూడా చావలేకుండా వున్నాను" ఆమె కళ్ళ వెంబడి నీరు ధారగా కారుతోంది. రావు హృదయం ద్రవించిపోయింది.

ఈ ఇరవై రూపాయల పెట్టుబడితో ఏదయినా వ్యాపారం చేసుకొమ్మని అక్కడ ఉంచాడు. "ఎవరి కర్మ వారిది. మీరెవరు? నేనెవరు? అక్కర లేదు."

రావు తిరిగి తీసుకోకుండా వెళ్ళిపోతున్నాడు. ఇంతలో పెద్ద పిల్లవాడు బియ్యం తీసుకు వచ్చి "డబ్బులు డబ్బులు" అని వాటిని జేబులో పెట్టుకున్నాడు. తిరిగి వారం రోజులకు రావుకు సుబ్బులును చూడాలనే సంకల్పంకలిగింది. అతన్నిచూడగానే ఆమె ముఖం వికసించింది. కాని వెంటనే ముడుచుకుపోయింది. 'కూర్చోండి' అంది నీరసంగా.

"విస్తళ్ళ వ్యాపారం ఎల్లా ఉన్నది"

"నా మొహం అల్లే ఉంది. మీరు వెళ్ళిన మరు రోజు నుంచి జ్వరాలు. పిల్లలకు కూడా జ్వరాలే. పూ జ్వరాలు, వాళ్ళకు తగ్గినై నాకింకా తగ్గలేదు."

రావు చూపులు అనుమానిస్తున్నట్లుగా ఉన్నై.

"నేను అబద్ధం చెబుతున్నా ననుకుంటున్నారు కాబోలు. మీకు చేయి చూడడం వస్తే చేయి చూడండి."

రావు చేయి చూశాడు. జ్వరం ఉన్నది.. చేయి ఉష్ణంగా ఉంది.

"మీరు వద్దంటున్న కొద్దీ ఇరవై రూపాయలు పడేసి వెళ్ళారు. డాక్టరు ఖర్చులకు. మందు ఖర్చులకూ అని అయిపోయినై. మేం ఎలా తీర్చుకోవాలా అనుకుంటున్నాం. మా కర్మకు మమ్మల్ని వదలివేయకుండా మీరుదరిద్దామను కొన్నారు. ఎంత పెరిగినా గొట్టెకు బత్తెడు తోక, మా సంసారమూ అంతే"

రావు మాట్లాడలేదు... పిల్లవాడు వచ్చి 'తెల్లకాగితాలు లేవే అమ్మా' అన్నాడు.

ఎన్ని కావాలని అడిగాడు. వాడు రెండు దస్తాలని అంటే డబ్బిచ్చాడు. వాడు గంతులేస్తూ కొనుక్కోవడానికి వెళ్ళిపోయాడు.

"మా శంకరానికి డబ్బిచ్చి మమ్మల్ని మళ్ళీ ఋణంలో పడవేస్తున్నారు" అన్నది సుబ్బులు.

"ఇది అప్పుకాదు." శంకరం కాగితాలు తెచ్చి పుస్తకాలుగా కుట్టుకుంటున్నాడు.

'వెళ్ళివస్తాన'ని రావు లేచాడు, ఆమె చేతులు జోడించి "నమస్కారం, మీ ఋణం తీర్చుకుంటాను. మేము ఎవరి సొమ్మూ ఎగవేయలేదు - సామానయినా అమ్మి తీర్చుకున్నాముగాని" అన్నది. ఆమె దయనీయమైన స్థితికి రావు మనస్సు చివుక్కుమన్నది.

తిరిగి వారం రోజులకు వాళ్ళ యింటికి రావు వెళ్ళాడు. గది ఖాళీచేసి వెళ్ళిపోయారని, ఎక్కడకు వెళ్ళారో తెలియదనీ ఇంటివారు చెప్పారు. ముక్కూ మొఖమూ తెలియని వారిపై తనకు కలిగిన నిర్హేతుకమైన జాలి, అప్పుపేరిట ఇచ్చిన సొమ్మూ తలచుకుని రావు తనలోతానే నవ్వుకున్నాడు. ఇలు ఖాళీ చేయవలసి వస్తుందని సుబ్బులు తనతో మాటమాత్రమయినా సూచించలేదనుకొన్నాడు. తాను వంచింపబడినాడా అనే అనుమానం కలిగినదికాని, ఆ అప్పు తనకు తానుగా ఇచ్చిందికాని. వారు కోరినది కాదనే విషయం జ్ఞప్తికి తెచ్చుకుని వంచింపబడలేదని తృప్తి పడినాడు. రెండు నెలలు గడిచినై శంకరానికి రెండు దస్తాల కాగితాలు రావు ఇచ్చాడనే విశ్వాసంఉన్నది. రోడ్డుమీద అతడే రావును గుర్తుపట్టి మారిన ఇల్లు చూపిస్తానని తీసుకొనివెళ్ళాడు, రావును చూడగానే సుబ్బులు తల వాల్చివేసింది.

"అద్దె బకాయికోసం ఇంటివారి ఒత్తిడి ఎక్కువ అయిందండీ. కొన్ని సామాను. అమ్మి అద్దె చెల్లించి ఇక్కడకు వచ్చేశాం. అది సందులో మేడమీద గది. ఇది మెయిన్‌రోడ్డుమీద సాదా ఇల్లు. రెంటికీ అద్దె ఒక్కటే. ఇదే యింకా పది రూపాయలు తక్కువ. మీ సొమ్ము ఇవ్వకుండానే ఇల్లా రావలసి వచ్చింది. ఏమీ అనుకోకండి. హఠాత్తుగా ఖాళీచేసి రావలసి వచ్చింది."

రావు మాట్లాడలేదు. రావు ఆమె వైఖరిని పరీక్షిస్తున్నాడు.

"మీ రిచ్చిన అప్పు జబ్బులు నయంచేసుకోడానికి సరిపోయింది. అది లేకపోతే అప్పుడేమయేవాళ్ళమో! నేను వద్దంటున్నా పడేసి వెళ్ళారు. భగవంతుడే మీచేత ఆ పని చేయించాడని అనిపిస్తోంది. వెనుకటికంటె కూడా ఇప్పుడు మా పని మరీ నాసిగా ఉంది. అప్పుడు మీరు అప్పు ఇస్తానంటే తీసికోవడానికి సందేహించాను. ఇప్పుడు నోరు తెరుచుకుని అడుగుతున్నాను. నాకు తల తిరిగి వచ్చింది. ఏదో వ్యాపారం పెట్టకపోతే బ్రతుకలేం."

"వ్యాపారం పెట్టడం నమ్మకమేనా?"

"నన్ను అనుమానించకండి. జబ్బులు చేయకపోతే మీరిచ్చిన డబ్బులతో విస్తళ్ళే తయారుచేసేదాన్ని, కాని దానిలో ఆటే గిట్టుబాటు ఉండదు. ఈ ఇంటికి మారేము కనుక తినుబండారాల వ్యాపారానికి ఇక్కడ అనుకూలంగా ఉంటుంది. నేను తయారు చేసి ఇస్తే. పిల్లలు వాకిట్లో కూర్చుని అమ్ముతూ ఉంటారు."

"ఎంత కావాలి పెట్టుబడి."

"నాకు మాత్రం ఏం తెలుసు. మీకు వీలయితే ఒక యాభై రూపాయలివ్వండి."

ఇచ్చాడు. ఆమె కళ్ళు కృతజ్ఞతతో మెరిసినై. "భగవంతుడున్నాడండీ. మేము రెండో పూట కూడా అన్నం తింటాం." అని చేతులు జోడించి నమస్కరించింది.

వారం రోజులకు మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి వాకిట్లో అరుగుమీద పళ్ళేలలో పిల్లలు వడలు, పచ్చిమిరపకాయ బజ్జీలు పెట్టుకుని కూర్చున్నారు. దారేపోయేవాళ్ళు, చిన్నపిల్లలూ, రిక్షావాళ్ళూ కొనుక్కుపోతున్నారు. లోపలికి వెళ్ళేటప్పటికి సుబ్బులు వికాసంతో పలుకరించింది.

"పిల్లలు వీటిని భక్షించడంలేదు కదా?"

"లేదు. సుగ్రీవాజ్ఞ. తిన్నవాళ్ళకి రెండవ పూట అన్నం లేదు."

"ఆశ్చర్యం!"

"మీరు ఏమీ అనుకోకుండా ఉంటే రెండు చవిచూద్దురుగాని."

"మీ పిల్లలే తి[illegible], నేను మాత్రం తింటానా?"

"మీ బాకీ యిప్పట్లో తీర్చలేను. తీరిస్తే మళ్ళీ వస్తుండాలి" "మీరొకదానిలో పడ్డారు కదా! తొందరలేదు" "మీ దయవల్లే" "అది పెద్ద మాట"

రావు కొంత కాలానికి ఆ యింటికి వెళ్ళాడు. ఆకలికి నకనకలాడే పిల్లలకు కాస్త డొక్కలు పూడినై. కాని సుబ్బులు దిగులుగానే కూర్చుంది. "మీ కెంత మంది పిల్లలు" అంది. "ఒక కొడుకూ, ఒక కూతురూ" అన్నాడు. "మీ ఇంటి చిరునామా ఏమిటి." చెప్పాడు. 'ఎం వస్తావా?' "రానులెండి. ఊరికే అడిగాను." అన్నది ముక్తసరిగా. "మీకు ఇప్పటికి డెబ్భైరూపాయలు ఇవ్వాలి" "నేను మిమ్మల్ని వత్తిడి చేయలేదుగా" అన్నాడు. "అదేమిటి ఒత్తిడి చేసినా చేయకపోయినా బాకీ బాకీయే గా. మీకు చిరిగిపోయిన చొక్కాలుంటే వాటిని మావారు అడగమన్నారు. కుట్టుకుని తొడుక్కుందామని."

"పిల్లవాణ్ణి పంపించు. అల్లాగే ఇస్తాను."

"వారం రోజుల్లో సంక్రాంతి పండుగ వస్తోంది."

"అవును."

"వారు మిమ్మల్ని సంక్రాంతికి నాచీరకూ పిల్లల చొక్కాలకూ ఒక వంద రూపాయలు అప్పు అడగాలని తీర్మానించుకున్నారు."

"వెనుక పల్లెటూరి గ్రంథాలయాలవారు విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారిని ఉచితంగా 'ఆంధ్రపత్రిక' పంపమని కోరడానికి తీర్మానించుకుని, ఆ తీర్మానం పంతులుగారికి తీసుకు వెళ్ళి చూపించేవారట. వారు నవ్వుకుని నా పత్రికకు మీ తీర్మానం ఏమిటని, ఏదో కొంత కాలం పంపిస్తూ ఉండేవారట!" "వారు మిమ్మలను ఉచితంగా కోరటంలేదు. అప్పుగా అడుగుతున్నారు."

"నిజమే, తీర్మానం అంటే జ్ఞాపకం వచ్చింది".

వెంటనే పెట్టె తీసుకువచ్చి తెరచి ముందు పడేసింది. "చూడండి, నేను అబద్ధము చెబుతున్నానేమో. నాకున్నది ఒకటే గట్టి చీర. కొందామంటే ధరలు మండిపోతున్నాయి. అదే ఉతికి ఆరవేసుకుని ఎప్పుడయినా బయటకు వెళ్ళినప్పుడు కట్టుకుంటున్నాను. మిగిలినవన్నీ అతుకుల బొంతలు. పిల్లల సంగతి చెప్పనక్కరలేదు. బడుద్ధాయిలల్లే ఉన్నారు. పండుగ ఎల్లా వెడుతుందో ఏమిటో" ఒక కుటుంబాన్ని ఇంకొకరు ఆదుకోవడం ఎంత కష్టం! తనకూ, వాడికీ సంబంధం ఏమిటి? బాదరాయణ సంబంధం - ముక్కూ మొఖము తెలియనివాడు ఇంటికి భోజనానికి వచ్చాడట; భర్త వంక చుట్టమని భార్య అనుకుంది. భార్య వంక చుట్టమని భర్త అనుకున్నాడు. మర్యాదలు జరిగినవి. సుష్టుగా భోజనం చేసి నిద్రపోయి వెళుతున్నాడు. వారి దొడ్లో ఒక రేగు చెట్టు దగ్గర బండి నిలిపి చెట్టుకు ఎడ్లను కట్టివేశాడు ఇంటికి వచ్చేటప్పుడు. ఆయన వెళ్ళేటప్పుడు భర్త భార్యను ఈయనెవరని అడిగాడు. నాకు తెలియదన్నాడు. ఇద్దరూ ఆయనెవరో తెల్సుకోవడానికి ఆయన దగ్గరకు వెళ్ళారు. మీ దొడ్లో రేగు చెట్టున్నది. నా బండికి రేగు కర్ర ఉన్నది. రెండూ బదరీ సంబంధులే కనుక మనది బాదరాయణ సంబంధం అని చెప్పాడట! అల్లాగే తమకు గల సంబంధం సిటీ బస్సు సంబంధం - ఈ విధంగా ఆలోచిస్తున్నాడు రావు. సుబ్బులు అతని మనోభావాలను గమనిస్తున్నది. "ఎవరి సంసార బాధలు వారివి. మీకు వీలుంటే ఇవ్వండి. లేకపోతే వెనకటి పండుగల లాంటిదే ఇదీను." జాలి చాలా చెడ్డది - అనుకున్నాడు రావు, ఆమె కన్నీరు చూడలేకపోయాడు. "చొక్కాల కోసం వస్తాడుగా పిల్లవాడు. వాడికిచ్చి పంపిస్తాను" అన్నాడు. "మిమ్మల్ని పీడించి తీసుకుంటున్నాను. ఏంచేస్తాను, ఇది నా అవసరం."

"ఫర్వాలేదులే" అన్నాడు.

"సంక్రాంతి నాడు తప్పక మా యింటికి రండేం. వీటిని యింటిలో వాడేసుకుంటారనుకుంటారేమో, క్రొత్త బట్టలు మీకు చూపిస్తాను. వాటిని తొడుక్కుంటే మా పిల్లలు ఎల్లా ఉంటారో చూదురుగాని. వాళ్ళ చేత మీకు దణ్ణం పెట్టిస్తాను."

సంక్రాంతి నాడు వారింటికి వెళ్ళడానికి రావుకు వీలుపడలేదు. తన అత్త వారింటికి వెళ్ళవలసివచ్చింది. తానింతవరకు ఇచ్చిన డబ్బు అప్పు పేరుతో ఇచ్చినా 'కృష్ణార్పణం' అనుకునే ఇచ్చాడు. వారంతట వారు ఇవ్వలేరనేదీ, వారిని పీడించి తాను తీసుకొనలేననేదీ నిజమని అతనికి తెలుసు. అడిగితే కాదనలేకపోవడం అతని దౌర్బల్యం అనుకున్నాడు. దౌర్బల్యం అనుకునే కన్నా అల్లాంటి వారికి నిష్కామంగా సహాయపడడంలో అతనికి తృప్తికూడా కనిపించింది. లోకంలో దరిద్రులు చాలామంది ఉంటారు. వారికికూడా తానిదే సహాయం చేయగలడా? చేయలేడు. మరి ఇక్కడ ఇంత ఉదారంగా ఎందుకుంటున్నాడు? ఆమె తన దగ్గర తన హృదయాన్ని విప్పి చెలతనాన్ని ఎందుకు ప్రకటిస్తోంది? సమాధానాలు దొరకడంలేదు.

కొంత కాలానికి మళ్ళీ వెళ్ళాడు రావు వారింటికి. వాకిట్లో పిల్లలు పుణుకులు అమ్ముతూనే ఉన్నారు. పెద్దవాడు తప్ప, మిగిలినవాళ్లు స్కూలుకే వెళ్ళడం లేదని అర్థమయింది. చదువుకొనదగిన వయస్సులో పిల్లల్ని ఇలా పాడుచేస్తున్నందుకు రావుకు బాధ కలిగింది. ఇంట్లో ప్రవేశించగానే "మిగతా పిల్లలు స్కూలుకు వెళ్ళడం లేదా" అని అడిగాడు. "లేదు. వాళ్లు వెడితే మా బ్రదుకేది?" అన్నది సుబ్బులు.

"అసలు చదువు అంటే నాకు కసి ఏర్పడింది. ఇంటర్మీడియేటుదాకా చదివి మావారూ, మెట్రిక్ దాకా చదివి నేనూ ఏమి బావుకున్నాము? మా పిల్లలకు ఉద్యోగాలు వస్తవని నమ్మకం నాకు లేదు. అన్నం పెట్టలేని చదువువల్ల ప్రయోజనంలేదు. వారికి కలిగే విజ్ఞానంకూడా అంతంత మాత్రమే. ప్రవేశపెట్టాను కనుక పెద్దవాణ్ణి చదివిస్తాను. రెండవ వెధవకు ఈ పుణుకుల దుకాణమే పెద్దదిచేసి కొట్టుక్రింద పెడతాను. రెండవ వెధవకు సైకిలు దుకాణంలో పనినేర్పిస్తాను. మూడవ వెధవకు కరెంటుపని నేర్పిస్తాను.

గొప్ప చారిత్రక నవలలు
నోరి నరసింహశాస్త్రి
కవిసార్వభౌముడు 7-50
ఆంధ్రప్రభ ... బహుమతి పొందినది
వాఘిర 4-50
యమ్.వి.యస్.శర్మ
మహాసేనాని 6.00
పి. వెంకట్రాజు
మహామంత్రి తిమ్మరుసు 2.50
గుంటి సుబ్రహ్మణ్యశర్మ
రజియా 2.50
పై పుస్తకాలకు రూ|| 20/ M.O చేసిన పోస్టేజి భరించి పంపగలము. ... లేదు.
క్వాలిటీ పబ్లిషర్సు
విజయవాడ-2

నాల్గవ వెధవచేత కిళ్లీకొట్టు పెట్టిస్తాను. అందులోనే సోడాలు, పత్రికలు, బొమ్మల పత్రికలూ అమ్ముతూ ఉంటాడు. అయిదవ వెధవకు సైకిల్ రిక్షా కొనిపెడతాను. వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతుకుతారు, రోజు కింతని వస్తుంది. జీతాల కోసం నెలదాకా కూర్చో నక్కరలేదు. మా వాళ్ళంతా కష్టించి పని చేస్తారు. చక్కగా లేబర్లయి పోతారు. జెండాలు చేతుల్లో పుచ్చుకు తిరుగుతారు" అని నవ్వింది.

రావు మాట్లాడలేదు.

"అది కాదండీ! లేబర్లేమో మేం ఉన్న వాళ్ళ మనుకుంటున్నారు. మాకేమో తిండి లేదు. రిక్షా ఎక్కడానికి వాళ్ళడిగే రేటు చూస్తే భయంగా వున్నది. వాళ్ళ పనే బాగుంది. చక్కగా మొగుడూ, పెళ్ళామూ పిల్లలూ పని చేసుకుని సంపాదించుకుంటారు. సినీమాలు చూస్తారు. శ్రమ ఉన్నా డబ్బుకు లోటుండదు. వాళ్ళల్లో కూడా పిల్లల్ని బి. ఎ. యమ్. ఎ. దాకా చదివించు కున్న వాళ్ళున్నారు."

రావు మాట్లాడలేదు.

పెట్టె తీసి సంక్రాంతికి కొనుక్కున్న బట్టలు చూపించింది. మీ దయవల్ల పండుగ బాగా జరిగిందని మెచ్చుకున్నది. ఆ రోజు రానందుకు నొచ్చుకున్నది. తన భర్త ఇదివరకు ఇంటికిచ్చే విధంగా డబ్బు ఇవ్వడం లేదనీ, ఏ ఖర్చులు చేస్తున్నాడో తెలియదనీ, అప్పుడప్పుడు మాత్రమే ఇంటికి వస్తున్నాడనీ, దీనంగా తన కథను చెప్పుకుపోయింది. రెండు మోకాళ్ళ మధ్య తల ఉంచుకుని వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. ఏడుపు మానవలసిందని నెమ్మదిగా రావు చెప్పాడు. రోజూ తనకు వచ్చే వ్యాపార లాభంమీద ఇల్లు హాయిహాయిగా గడుస్తోందనీ, రేపు డబ్బు కట్టకపోతే పిల్లవాడి పేరు స్కూలులో కొట్టివేస్తారనీ చెప్పింది. అతని కుర్చీ దగ్గరకు ముక్కాలిపీటను లాక్కుని కూర్చుని "మీ జేబులో ఎంత డబ్బుంది" అని దీనంగా అడిగింది. రావు లేచాడు. "మీకు కోపం వచ్చినట్లుంది అలా అడిగినందుకు—క్షమించండి. అవసరం కొద్దీ అడిగాను" అన్నది. "మీవాడు పదవతరగతి పూర్తి చేసేదాకా జీతం నేను ఇస్తాను. తర్వాత వాడు మీ కుటుంబానికి ఆధారం కావచ్చు" అన్నాడు. పది రూపాయిలిచ్చాడు. ఆమె ముఖంలో వేయి తామరలు వికసించినై. "ఇక నేను బ్రతుకవచ్చు" అన్నది. ఇంతకాలంనుండీ ఆమె ముఖంలో ఉత్సాహం రావు చూడనేలేదు. ఒక్కసారిగా ఆ జీవి పొందిన సంతోషం చూసేసరికి అతని హృదయం సంతృప్తితో నిండిపోయింది. అతడు ఇన్నాళ్ళనుండి కట్టె, కొట్టె, తెచ్చె గా మాట్లాడమే చూసింది. కాని అతని ముఖంలో సంతృప్తికి సంబంధించిన కాంతిరేఖను ఆమె చూడనేలేదు. అసలు అతని ముఖంలో భావాలు ప్రతిఫలిస్తవనే ఆమె ఎప్పుడూ అనుకోలేదు. అప్పటినుంచి అతనిని గూర్చి ఆలోచించడం ప్రారంభించింది.

"తొలి పరిచయం అయిన దగ్గరనుంచి అతడు విడువకుండా తన ఇంటికి ఎందుకు వస్తున్నాడు? వట్టి జాలిచేతనా—లేక విశేషించి యేమైనా ఉన్నదా, తాను త్వరగా తిరుస్తా ననే నమ్మకం లేకపోయినా యింత డబ్బు ఎందుకు అప్పిస్తున్నాడు? ఇచ్చిన బాకీకి ఎందుకు ఒత్తిడి చేయడంలేదు? ఇంటి దగ్గర సుఖంలేక వస్తున్నాడనుకుందామా, ఇక్కడ సరదా కాలక్షేపంకూడా లేదే! తాను అందగత్తెననుకున్నాడా?" వెంటనే అద్దంచూచుకుంది. పిల్లలయితే అయిదుగురు పుట్టారు కాని తనకు పదహారం పాతికేళ్ళయినా నిండలేదు. శరీర పోషణలేక తానిలా ఉన్నదికాని లేకుంటే తాను అందగత్తెనే అని నిశ్చయం చేసుకుంది. తన సహాయంతో శరీర పోషణ జరిగి, తన అందం పెరిగితే అతనికి ఆస్వాదించవలెనని ఉన్నదా? ఛీ అల్లాంటి దున్నట్టులేదు. అల్లాంటి ఊహ ఉంటే మాటల్లో ఎక్కడో అక్కడ దొరికిపోడా? ఏమో, మగవాడు. అప్పు బాగా పెరిగిన తర్వాత తీర్చలేక లొంగిపోక ఏం చేస్తుందనే ధీమాతో పెట్టుబడి పెడుతున్నాడా? తాను కోరినప్పుడు, తనకు నిజంగా అవసరమని అనిపించినప్పుడు డబ్బిచ్చాడే కాని వేరుకాదే! ఇటీవల తరచుగా రావడం కూడా మానివేశాడే! ఏమో అబ్బా! అతనిది వింత మనస్తత్వం! ఏమైనా తాను ఎండలో ఉండగా అతడు నీడను చూపించాడు. తనకు మాత్రం అతడు మంచివాడే. ఇల్లా ఆదరించే వారు లోకంలో కోటికి ఒక్కరు కూడా ఉండరు. తన యింటికి వచ్చినప్పుడు కాస్త కాఫీ యిచ్చి సంతోషంతో మాట్లాడితే అతడు సంతోషిస్తాడు. ఇంట్లో అతనికి సంతోషం లేదేమో! తనఏడుపే తనకు తప్ప అతని ఇంటి విషయం తానెప్పుడూ చొరవగా అడుగలేదు. ఈ దఫా అతడువచ్చినప్పుడు ఉత్సాహంగా కన్పించాలి. అలా కన్పిస్తే సంతోషించే మనిషేకాని ఉద్రేక పడే మనిషి మాత్రం కాడు. అందుచేత ఆ భయం మాత్రం లేదు — ఈ విధంగా సుబ్బులు మనస్సు పనిచేయడం ప్రారంభించింది. కృతజ్ఞతా భావంతో నిండిపోయిన తన హృదయాన్ని ముఖ వికాసంద్వారా అతనికి వ్యక్తం చేయాలనుకుంది. ఈభావన వారి పరిచయంలో క్రొత్త మలుపు.

మరునెల జీతం ఇవ్వడానికి రావువచ్చాడు సుబ్బులు మందహాసంతో ఆహ్వానించింది. ఎప్పుడూ కండిరీగలకుట్టినట్టుండేముఖంలో వికాసం చూసి రావు సంతోషించాడు. విచారంతో క్రుంగిపోయే వారికి చూపుకూడా పోయే ప్రమాదమున్నదని అతడు భయపడేవాడు. సంధ్యా కాలం. దీపం మినుకుమినుకుమంటున్నది. పిల్లలు వాకిట్లోనే ఉన్నారు. వంట యింటిలో ముక్కాలిపీటపై రావును కూర్చోపెట్టి సుబ్బులు కాఫీ యిచ్చింది. కాఫీ త్రాగిన ప్లేటు తానే అందుకుంది. అతని రెండు పాదాలూ తాను ముట్టేసుకుంది. "మీ మేలు మరువలే"నన్నది. "వద్దు వద్దు" అని ఆమె చేతులను తొలగించి అతడు లేచి నిలబడ్డాడు. వంగిన ఆమెకూడా అతనితో పాటు చువ్వల్లే లేచి నిలబడింది. వెంటనే ఆమె పైట జారిపోయింది. ఆమెముఖంలో నూతనోత్సాహపు పొంగులు ఉన్నై. ఆమె వక్షస్థలం ఊగులో ఉన్నది. సందె చీకటి అయినా ఇవన్నీ గమనించగలిగాడు రావు. అతని రెండు భుజాలమీదా తన రెండు చేతులూ వేసి, దగ్గరకు లాక్కుని, మరుక్షణంలో నడుము చుటూ చేతులు బిగించి హత్తుకుని "మీరెంత మంచివారండీ" అన్నది. అతడు విస్తుపోయి, వెనుకకు తగ్గి గోడ కానుకున్నాడు. అతను వెనుకకు తగినా ఆమె వెనుకకు తగ్గలేదు.

క్షణాలో జరిగిన ఈ పరిణామాలను గురించి అతనికి ఆలోచించే వ్యవధి లేదు. ప్రవరుడి మోస్తరుగా ఓర మోమిడడానికి గోడ అడ్డం — అంసహ్యయం అంటి "పో" అని తోస్తే ఆమె తల బ్రద్దలవుతుంది. ప్రదేశం ఇరుకు. తాను ఇరుకులో పడ్డాడు. మంచితనానికి తగిన శిక్ష జరిగిందనుకున్నాడు. అసహ్యంతో కళ్లు మూసుకున్నాడు. ఆమె కసిగా ముద్దుపైముద్దు కురిపిస్తోంది. అతనికి కోపం ఎక్కువవుతోంది. ఆమె అలిసిపోయింది. అతని చెక్కిలిపై చెక్కిలి చేర్చింది. "రాయైనను మేల్ నారాయణ మీ మనసుకన్న" అన్నది. నిట్టూర్చింది. కదలకుండా అక్కడే నిలబడింది. వెళ్ళిపోయిందేమోనని కళ్ళు తెరిచాడు. ఆచ్ఛాదనంలేక తబిబ్బవుతున్న ఆమె వక్షస్థలం గోచరించింది. వెంటనే కళ్లు మూసుకోబోతుంటే ఆమె అతని చెంప ఛెళ్లుమనిపించింది. వెంటనే ఆమె రెండు చెంపలూ ఛెళ్ళుఛెళ్ళుమన్నాయి. అప్పటికి ఆమె మైకం దిగింది. ముందు గదిలోకి వెళ్ళి మంచంమీద బోర్ల బొక్కుడుగా పడి ఏడవడం ప్రారంభించింది. అతడు ఆ గదిలోనే కుర్చీలో కూర్చున్నాడు. తలయెత్తి చూసి లేచికూర్చుంది.

"నన్ను క్షమించరా" అన్నది.

"దేనికి క్షమించడం".

"నేను చేసిన పనికి".

"ఏమిచేశావు. పాపం శ్రీ వి. కాస్త ముందుకు వచ్చావు"

"మిమ్మల్ని ..."

"అది వట్టి చాపల్యం".

"అట్లా ఊరికే అంటున్నారు నా మీద కోపంచేత"

"ఏదో చీకటికిదా! చీకటి తప్పుకు ప్రయత్నించావు. ఏముంది అందులో."

అల్లామాట్లాడడంకన్న నన్ను కత్తితో కోసివేయరాదూ!"

"నే నేమి నిన్ను అనడంలేదే. చీకటి పంచలో కూడా నిన్నేమీ అనలేదే. నీవు ఒక చెంప మీద కొటావు కనక నేను రెండు చెంపలమీద కొట్టాను. అంతే, నేను ఒక చెంప కొడితే రెండవ చెంప కొట్టడానికి ఇచ్చే వాడిని మాత్రం కాదు."

"ఆ శిక్ష నాకు చాలదు. కృతజ్ఞతా భావంతో నిండిఉన్న నేను కృతఘ్నతనే చూపించాను."

"అది నీ తప్పుకాదు, సుబ్బులూ! నా తప్పు!"

తెల్లబోయింది.

"నీవు సిటీ బస్సులో చొరవగా పల్కరించినప్పుడే నిన్ను అంచనా కటవలసింది. ఆసక్తిగా నిన్ను అనుసరించడం గొప్ప తప్పు. నీవు డబ్బు కోసం వలపన్నుతున్నావని గ్రహించలేక జాలితో డబ్బు ఇస్తూ ఉండడం మరొక తప్పు. ఆ తప్పులకు శిక్ష విధించిన నీకు తప్పు ఎక్కడ ఉంది?'

"మీరు ఎన్నయినా అనండి. చిట్టచివర నేను చేసిన గొప్ప తప్పువల్ల, నేను మీపై వలపన్నే యత్నం చేశానని మీరు అనుకోవడం సహజమే. నేను నా బిడ్డలపై ప్రమాణంచేసి చెబుతున్నాను, నేను వల పన్నలేదు. సొమ్ము ఎగవేయదలచలేదు. అందుకై మిమ్మల్ని లొంగదీయ ప్రయత్నం చేయలేదు. నా జీవితంలో మొదట చేసిన తప్పు ఇదే. చివరి తప్పు కూడా ఇదే ఇక జీవితంలో ఇల్లాంటి తప్పు చేయను" అని ఏడవడం మొదలుపెట్టింది.

రావుకు జాలి కలుగలేదు. ఆ మాటల లోతును తెలిసికోవాలని ప్రయత్నం చేస్తున్నాడు.

"మరి ఎందుకు చేసినట్లు." మాటలు కఠినంగా ఉన్నై.

'నేను ఆడదాన్ని! వివేకం కోల్పోయాను

"పాపం!"

"నేను అబలను. దుర్బలను."

"నాటకంలో డైలాగ్ ఇలాగే ఉంటుంది".

"మీకు వెయ్యి వేల నమస్కారాలు. నన్ను చిత్రవధ చేయకండి. నా మాటలు తేలికగా కొట్టి పారవేయకండి. ఆ క్షణం అల్లాంటిది. 'అసురసంధ్య'లో తండ్రీ కూతురయినాసరే, ఏకాంతంగా ఉండకూడదని చెబుతారు. నాలో ఆ క్షణంలో ఆ సుర శక్తి విజృంభించి, మీ మంచితనానికి సమ్మోహపడిన నేను. మీ శరీర సౌందర్యానికి కూడా సమ్మోహితురాల నయాను. ఇది నిజం. మీరు నమ్మండి నమ్మకపోండి. ఆ క్షణానికి పూర్వం ఆ భావం మీమీద నాకు లేదు. మీరు నా చెంపలు ఛెళ్ళుమనిపించిన క్షణం నుంచేలేదు. ఆ మధ్య కాలంలో నేను నేను కాదు. అప్పుడు నేను పిశాచిని. ఇప్పుడు వెనుకటి సుబ్బులుని."

రావు ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"నేను చేసిన అత్యాచారానికి నాకు శిక్ష విధించండి. సంతోషంతో అనుభవిస్తాను. కాని నా పై కోపంమాత్రం మానివేయండి".

"నాకు నేనే శిక్ష విధించుకుంటాను.'

మీకు శిక్ష అవసరంలేదు. ఆ శిక్ష నేనే విధించుకుంటాను.

ఇంతటిలో భర్త వచ్చాడు. తన కుమారునికి జీతం కడుతున్నందుకు రావుకు కృతజ్ఞతను వెల్లడించాడు. సుబ్బులు లేచి దొడ్లోకి వెళ్ళిపోయింది. రావు అడుగులు లెక్కపెట్టుకుంటూ వీధిలోకిసాగిపోయాడు. దారిలో పెద్ద పిల్లవాడు కన్పించే. నెలనెలా వచ్చి తన దగ్గర జీతం డబ్బులు తీసుకొమని చెప్పాడు.

నెల గిర్రున తిరిగి వచ్చింది. పిల్లవాడు జీతంకోసం వచ్చి తీసుకున్నాడు.

"మా అమ్మ మూడు వాతలు పెట్టుకున దండీ" అన్నాడు.

"ఎప్పుడు?"

"మీరు వెళ్ళిన రోజు రాత్రి. మా నాన్న ఇంటిలోనుంచి వెళ్ళిపోయిన తర్వాత మేము నిదుర పోయేటప్పుడు. సూదులు కణకణ కాల్చి, ముంజేతిపై పెట్టుకుంది."

"ఎందుకుట!

"మా నాన్నతో చెప్పింది ఒకటేమో మా నాన్న తన సంపాదనతో కుటుంబాన్ని పోషించనందుకట; రెండవదేమో. తాను దరిద్రురాలైకూడా అయిదుగురు పిల్లలను కన్నందుకట. మూడవదేమో, పరాయి మగ వాడి డబ్బుమీద బ్రతుకుతున్నందుకట?

రావు బాధపడ్డాడు. 'పుళ్లు మానినయ్యా'

"మానిపోయినై"

కొంత కాలానికి సూపరు బజారులో ఏవో వస్తువులు కొనడానికి సుబ్బులు వచ్చింది. రావుకూడా అక్కడే తటస్థించాడు. స్పష్టంగా కనబడే ఆ వాతలను చూసి రావు కళ్లు వెంబడి నీళ్ళు తిరిగినై. సుబ్బులు దగ్గరకు వచ్చింది. "మీది జాలిగుండె. మీరు శిక్ష విధించలేరు. నేనే విధించుకున్నాను. మరణానికే ఒకప్పుడు సిద్ధపడిన నాకు వాతలు లెక్కఏమిటి? వీటిని చూడగానే. రోజూ మీ మంచితనం,నా కృతఘ్నత జ్ఞప్తికి వస్తాయి. నన్నుమీరు అన్నివిధాల రక్షించారు."

రావు ఆమెను నిప్పులాంటి మనిషి అనుకున్నాడు.

★

వార్తలకు, వ్యాఖ్యలకు

"ఆంధ్రజ్యోతి"

దినపత్రికనే చదవండి

# ఉబ్బసానికి మూలిక

ఉబ్బసాన్ని తగ్గించె మూలిక ఒకటి రాజస్థాన్ వాస్తవ్యులు స్వర్గీయ శ్రీ శంభునాథ్‌గారి మనుమడు శ్రీ కేశవ మోహన్‌లాల్ చే పేదవారికి పంచి పెట్టబడుతున్నది.

ఈ మూలికను ఒక సన్యాసి శ్రీ శంభునాథ్‌కు ఇచ్చారు. 40 సంవత్సరాలకు పైగా ఆయన ఉచితంగా పంచిపెట్టారు. ఆయన నిస్వార్థ సేవకు మెచ్చి ప్రభుత్వం పంథను ఇచ్చింది. ఈ సత్కార్యాన్ని ఆన మనుమనికి అప్పగించి ఆయన సన్యాసి ఆశ్రమము స్వీకరించెను. ఇప్పుడు ఆయన మనుమడు ఈ కార్యభారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే భాగ్యవంతులకు ఈ సత్కార్యానికి విరాళమీయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నారు. అనేకమంది ఉబ్బసం రోగులు దీర్ఘకాల వ్యాధి పీడితులుకూడా ఈ మూలిక మూడు మోతాదులు సేవించి ఉపశమనంపొందారు. ఈ మూలికకోసం ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

శ్రీ కేశవ మోహన్‌లాల్

6. హరలాల్ దాస్ లేన్.

(జోరాబగన్ పార్క్), కలకత్తా-6.